స్కూళ్లు అస్తవ్యస్తం

కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యను సర్వనాశనం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలను రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో వున్న ఇతర పాఠశాలల్లో విలీనం చేశారు. పిల్లలను అంతదూరం పంపించలేమని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. దీనికితోడు ఉపాధ్యాయుల బదిలీలను వేసవి సెలవుల్లో కాకుండా పాఠశాలలు ప్రారంభమైన తర్వాత చేపట్టడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు టీచర్లు ఇంకా విధుల్లో చేరలేదు.



మూతపడిన విరూపాక్షిపురం బడి


బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్లలో 130 మంది పిల్లలకు బోధన చేస్తున్న టీచర్

- ఇతర పాఠశాలల్లో విద్యార్థుల విలీనం
- దూరం పంపలేమంటున్న తల్లిదండ్రులు
- మూతపడిన పలు పాఠశాలలు
- విధుల్లో చేరని పలువురు ఉపాధ్యాయులు
- బదిలీ అయిన టీచర్లకు రిలీవ్ లేదు
- డీఎస్సీలో ఎంపికైన టీచర్లు వచ్చేదాకా తప్పని సమస్య

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలను మెర్జ్ చేసిన చోట పిల్లలు రాక, బదిలీ జరిగిన బడుల్లో టీచర్లు లేక బోసిపోతున్నాయి. మూడు నియోజకవర్గాల్లో దాదాపు 700 మంది టీచర్లు విధుల్లో చేరాల్సి ఉంది. సింగిల్ టీచర్స్ ఉన్న బడుల్లో కొత్త టీచర్లు విధుల్లోకి చేరేదాకా వీరికి బదిలీలు లేకుండా పోయాయి. కొన్ని బడుల్లో ఎక్కువ సంఖ్యలో పిల్లలున్నా కావాల్సినంత టీచర్లు అందుబాటులో లేరు. కొన్ని చోట్ల మెర్జ్ అయిన బడులను ఆగస్టు 15 దాకా నిర్వహించాల్సి ఉన్నా అక్కడి టీచర్ల స్వార్థంతో మూసేశారు.

పక్క గ్రామాలకు పిల్లల్ని పంపమంటున్న తల్లిదండ్రులు

అయా గ్రామాల్లోని బడులను పొరుగు గ్రామాల్లోని ఎక్కువ పిల్లలున్న చోట్లకు మార్చి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందులో విలీనం చేసిన బడుల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలకు మాత్రమే అడ్మిషన్లని మెలిక పెట్టింది. మిగిలిన 1, 2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చి వీటిల్లోకి అంగన్‌వాడీ సెంటర్లను కలపనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అనేక మండలాల్లో రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని పక్క గ్రామానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేవని, చిన్నపిల్లలు అంతదూరం ఎలా వెళతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

మూతపడిన పాఠశాలలు

బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల మోడల్ స్కూల్‌లో 1 నుంచి 5 తరగతుల్లో 130 మంది విద్యార్థులున్నారు. వీరి బోధనకు ఐదుగురు టీచర్ల అవసరముంది. ఒక్కరే అన్ని తరగతులు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. విరూపాక్షిపురం ప్రైమరీ స్కూల్‌ను పాఠశాలల విలీనం పేరిట నెల్లిపట్ల స్కూల్‌లో విలీనం చేశారు. ఇక్కడున్న 3, 4, 5 తరగతుల పిల్లలు నెల్లిపట్లకు వెళ్లాలి. 1, 2 తరగతుల పిల్లలు ఉన్నప్పటికీ మూసేవారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చెప్పినా పట్టించుకోలేదు. విలీనమైన బడుల్లో ఇద్దరు విద్యార్థులున్నా ఈ నెల 15వరకు వాటిని కొనసాగించాలని డీఈవో ఆదేశించినా అక్కడి టీచర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తూ బడుల మూతకు కారణమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏడొందల మంది విధుల్లో చేరేదెప్పుడు

డివిజన్ పరిధిలోని పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో 700 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్తవారు వచ్చే వరకు రిలీవ్ అయ్యే అవకాశం లేదు. వారు వచ్చే వరకు బడుల్లో సింగిల్ టీచర్లే దిక్కు. బైరెడ్డిపల్లి మండలంలో 129 మంది బదిలీకాగా 49 మంది వరకు ఇంకా విధుల్లో చేరలేదు. ప్రస్తుతం 90 వరకు ఖాళీలు వున్నాయి. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ నెలకొంది.

ఇంత ఘోరంగా ఉంటుందని అనుకోలేదు



కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందనుకున్నాం. ఇంత అధ్వానంగా మారుతుందని కలలో కూడా ఊహించలేదు. బిల్డింగ్ గట్టిగా ఉండాలంటే బేస్‌మెంట్ బాగుండాలి. ఇక్కడ ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేసేశారు. దీన్నిబట్టి చూస్తుంటే ఈ ప్రభుత్వం పరోక్షంగా ప్రైవేటు బడులకు మద్దతుగా ఉందనే విషయం అర్థమవుతోంది.

–వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

ప్రాథమిక విద్య సర్వనాశనమైంది



స్కూళ్ల విలీనంతో పిల్లలను పొరుగూర్లకు పంపేదేలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. బదిలీ అయిన టీచర్లు కొందరు వెళ్లగా చాలామంది చేరలేదు. అక్కడికి టీచర్లు వస్తేగాని వీరిని రిలీవ్ చేయరట. మా మండలంలోనే 90 మంది టీచర్లు రావాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తే ప్రైవేటు బడులు పుంజుకుంటాయి.

– మొగసాల రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లి

పలమనేరులో భారీ వర్షం



బైరెడ్డిపల్లి పెద్దచెరువులోని గుంతల్లోకి చేరిన నీరు, పలమనేరులో కమ్ముకున్న కారుమబ్బులు

- చిత్తడిగా మారిన గ్రామీణ ప్రాంతాల రోడ్లు
- పలు గ్రామాలకు ఆగిపోయిన రాకపోకలు

పలమనేరు: పలమనేరు పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. గంటపాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండురోజులుగా వర్షం కురుస్తుండడంతో వాగులు పొంగాయి. చెరువుల్లో భారీ ఎత్తున మట్టిని తవ్వేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చినా ఇంకిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. వర్షం వల్ల పలు గ్రామీణ ప్రాంతాల రోడ్లు బురదమయమయ్యాయి. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతున్న పది గ్రామాల రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. మాదిగబండ వైపు నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్షం కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఉలవలు సాగు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.


బురదమయమైన గొల్లపల్లి- కల్లాడు రోడ్డు


వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు ఆగిపోయిన మాదిగబండ మార్గం

తల్లిపాలే బిడ్డలకు శ్రేష్టం

గుడుపల్లె: తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమని పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతితల్లీ బిడ్డలకు 6 నెలలు పాటు తల్లి పాలు పట్టాలన్నారు. అప్పుడే బిడ్డలు ఆరోగ్యంగా పెరుగుతారని పేర్కొన్నారు. అంతేగాక పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా వుంటుందని తెలిపారు. అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దామని తెలిపారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయకుమారి, ప్రదీప్, హరిచంద్ర చిత్రనాగరాజు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

మురుగు కాలువలు నిర్మించండి

రొంపిచెర్ల: మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీ బెస్తపల్లెలో సీసీ రోడ్డు వేసి కాలువలు నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డు మీదే నిలుస్తోంది. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. రోడ్డు బురదమయంగా మారడంతో నడిచేందుకు కూడా వీలులేకుండా వుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.


బెస్తపల్లెలో బురదతో నిండిన వీధి

ఘనంగా వరలక్ష్మీ వ్రతం




పులిచెర్ల(కల్లూరు): దేవళంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, పెద్దపంజాణిలో.., గుడుపల్లెలో..




చౌడేపల్లెలో.., వి.కోటలో.., గంగవరం: భక్తులకు గాజులు, కంకణాలు అందజేస్తున్న అధికారులు


పలమనేరు: సత్యగంగమ్మకు కరెన్సీ నోట్లతో అలకరణ

రొంపిచెర్ల/పులిచెర్ల(కల్లూరు)/పెద్దపంజాణి/గంగవరం / గుడుపల్లె/పలమనేరు/వి.కోట/చౌడేపల్లె: పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీ. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం నిర్వహిస్తారు. సిరుల తల్లి లక్ష్మీదేవిని పూజించడం వల్ల అష్ట ఐశ్వరాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఆలయాల్లో సామూహిక వ్రతం నిర్వహించారు. నిర్వాహకులు మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, కంకణాలతో కూడిన వాయనాలు అందజేశారు.

- రొంపిచెర్ల మండలం రొంపిచెర్లలోని ముత్యాలమ్మ ఆలయంలో అర్చకులు గుణశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వ్రతం చేపట్టారు. అదే విధంగా సాయిబాబా ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.
- **పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని దేవళంపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసుకున్నారు. పలువురు ఇళ్లలోనూ వ్రతం జరుపుకున్నారు.
- పెద్దపంజాణి మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి పిండి వంటలు చేసి లక్ష్మీదేవికి నైవేద్యం సమర్పించారు.
- గంగవరం మండలంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఆచరించారు. ఇళ్లలో అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి వ్రతం జరుపుకున్నారు. కీలపట్లలో వెలసిన కోనేటిరాయస్వామి ఆలయంలో టీటీడీ హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఉభయ దేవేరుల అభిషేకానంతరం అమ్మవారిని అర్చించిన కుంకుమ, గాజులు, పసుపు దారం, కంకణాలు, ప్రసాదాలను మహిళలు, భక్తులకు ఉచితంగా అందజేశారు.
- గుడుపల్లె మండలంలోని ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉపవాసం ఉండి అమ్మవారి ప్రతిమను ప్రతిష్టించి బంగారు ఆభరణాలు, పచ్చటి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు ఇచ్చారు.
- పలమనేరు పట్టణంలో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో అమ్మవారిని ప్రతిష్టించి పూజలు చేశారు. సత్యగంగమ్మ ఆలయంలో నిర్వాహకులు మీనాక్షి రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వ్రతాన్ని ఆచరించారు. మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ విశ్వ బ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పవిత్ర మహిళలకు పసుపు, కుంకుమ, సారె పంపిణీ చేశారు.
- వి.కోటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపారాధన చేశారు. ఇళ్లలోనూ వ్రతం ఆచరించారు.
- చౌడేపల్లె మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల అమ్మవారి ప్రతిమలను ఏర్పాటుచేసుకుని పూజలు చేశారు. మహిళలను ఆహ్వానించి తాంబూలం అందజేశారు.


పలమనేరు : విశేషాలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు


రొంపిచెర్ల : వరలక్ష్మీ వ్రతాన్ని నోచుకుంటున్న మహిళలు

ఘనంగా సౌభాగ్యం

పుంగనూరు: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సౌభాగ్యం కార్యక్రమాన్ని చేపట్టారు. వరలక్ష్మీ అమ్మవారిని విశేషంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి మహిళలకు సంప్రదాయబద్ధంగా సౌభాగ్యం కింద తాంబూలం అందజేసి సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.


మహిళలకు తాంబూలం ఇస్తున్న ఆలయ అధికారులు

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలు



చౌడేపల్లె: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ ఖాన్‌సాబ్‌మిట్ట లో చెట్ల తీగలు విద్యుత్ స్తంభానికి అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 11 కేవీ విద్యుత్ తీగల వరకు అల్లుకున్నాయి. విద్యుత్ స్తంభం రోడ్డు పక్కనే వుంది. పశువులు మేత కోసం అటుగా వెళితే షాక్‌కు గురయ్యే అవకాశం వుందని, ప్రమాదం జరగకనే తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

16న శ్రీకృష్ణుడి ఊరేగింపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు

పలమనేరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న పట్టణంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడిని ఊరేగించనున్నారు. ఈ మేరకు సేవా సమితి నిర్వాహకులు శుక్రవారం ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి సమక్షంలో ఊరేగింపు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని పట్టణంలో స్వామి వారిని ఊరేగిస్తున్నట్టు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నిర్వాహకులు రెడ్డి భాస్కర్, జ్యోతి, సరళ, రోజా పాల్గొన్నారు.

16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు


కుప్పం డీఎస్పీ పార్థసారథికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న సమితి ప్రతినిధులు

కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని ప్యాలెస్ వద్ద ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధి కృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం కుప్పం పట్టణంలోని ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ 21న స్వామివారి ఊరేగింపుతో వేడుకలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, కృష్ణారెడ్డి, శరవణ, రాజ్‌కుమార్, కృష్ణమూర్తి, ఇందిర, వెంకటలక్ష్మీ, పూజ, మైత్రి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు: పలమనేరు పట్టణంలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏడీ జీవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పలమనేరు డివిజన్ పరిధిలోని పలమనేరు రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి 11వ తేదీ పగలు విద్యుత్ కోత

పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారంలో 220 కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణం చేస్తున్నామని ఏడీ జీవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో శనివారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు పగలు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు తెలిపారు.

ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్‌కు డాక్టరేట్


బీసీ నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజుకు ప్యారిస్‌లోని థేమ్స్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఆయన విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. బీసీ నాగరాజు మాట్లాడుతూ తాను విద్యా సంస్థలు ఏర్పాటుచేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు. డాక్టరేట్ రావడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఆయనను ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్, చైర్ పర్సన్ శాంతానాగరాజు అభినందించారు.

16న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో 15, 16 తేదీల్లో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. 15న భరణి, శనివారం కృత్తిక కావళ్లు ఉంటాయని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రెండు రోజులు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. రాత్రి వీధి నాటకంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నోటీస్ బోర్డు

నేడు స్వామివారి కల్యాణం

పుంగనూరు: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు గరుడ సేవ, శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు కోనేటిరాయుడి కల్యాణం

గంగవరం: మండలంలోని కీలపట్లలో వెలసిన కోనేటిరాయుడి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణం కావడంతో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

12న మండల సమావేశం

పులిచెర్ల(కల్లూరు): ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు పులిచెర్ల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రాజశేఖర బాబు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సెప్టెంబర్ నుంచి దసరా ఉత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ ఆలయంలో సెప్టెంబర్ 22 నుంచి దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. వారు శుక్రవారం ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.